# క్లీన్ స్వీప్‌పై కన్ను

నేడు భారత్, అఫ్గానిస్థాన్ మూడో టీ20

రాత్రి 7 నుంచి..

*పొట్టి ప్రపంచకప్‌నకు ముందు టీమ్ ఇండియా తమ చివరి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. సంపూర్ణ ఆధిపత్యంతో అఫ్గాన్‌పై ఇప్పటికే సిరీస్ గెలిచిన రోహిత్ సేన.. క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగనుంది. దూబే, జైస్వాల్, రింకూ దంచికొడుతుండగా.. రోహిత్ మెరుపుల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!*



బెంగళూరు: ఇప్పటికే అఫ్గానిస్థాన్‌పై పొట్టి సిరీస్ కైవసం చేసుకున్న భారత జట్టు.. ఇక క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. ఈ ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్‌నకు ముందు టీమ్ఇండియా చివరి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన రోహిత్ సేన బుధవారం అఫ్గాన్‌తో ఆఖరి పోరులో అమీతుమీ తేల్చుకోనుంది. పొట్టి ఫార్మాట్‌లో యువ ఆటగాళ్లకు విరివిగా అవకాశాలివ్వగా.. వాళ్లు వాటిని రెండు చేతులతో ఒడిసి పట్టుకున్నారు. శివమ్ దూబే, జితేశ్ శర్మ, యశస్వి జైస్వాల్, రింకూ సింగ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ గత రెండు మ్యాచ్‌ల్లో రాణించగా.. సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా మంచి టచ్‌లో కనిపిస్తున్నాడు. ఎటొచ్చి కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాటింగ్ తీరే టీమ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతున్నది. ఎప్పుడూ లేని విధంగా హిట్‌మ్యాన్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ కావడం అతడిపై ఒత్తిడి పెంచుతుందనడంలో సందేహం లేదు. వరల్డ్‌కప్ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న ఆటగాళ్లకు ఈ మ్యాచ్ అనంతరం ఇక ఐపీఎల్ మాత్రమే అందుబాటులో ఉంది. గత మ్యాచ్‌లో ఆడిన జట్టునే బరిలోకి దింపుతారా లేక.. రిజర్వ్ బెంచ్‌ను పరీక్షిస్తారా చూడాలి. మరోవైపు స్పిన్ ఆయుధంగా బరిలోకి దిగిన అఫ్గాన్.. భారత జట్టుకు సరైన పోటీనివ్వలేకపోయింది. మరి ఆఖరి పోరులోనైనా కాబూలీలు సత్తాచాటుతారా చూడాలి.

# రన్నరప్ తెలంగాణ



మహిళల విభాగంలో విజేతగా నిలిచిన హర్యానా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 16: నేషనల్ ఫాస్ట్-5 నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పురుషుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల ఫైనల్లో హర్యానా 32-20 తేడాతో తెలంగాణ జట్టుపై గెలిచి ట్రోఫీ చేజిక్కించుకుంది. మహిళల విభాగంలో హర్యానా 43-23తో కర్ణాటకపై గెలిచింది. పురుషుల విభాగంలో ఢిల్లీ, మహిళల విభాగంలో తెలంగాణ మూడో స్థానం దక్కించుకున్నాయి. పోటీల అనంతరం విజేతలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ విజేందర్‌సింగ్, టోర్నీ చైర్మన్ అమిత్ అరోరా, కన్వీనర్ అకాశ్‌బాత్ర, అశోక్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# సాహో సుమిత్

## సీడెడ్ ప్లేయర్‌పై సంచలన విజయం

**35 ఏండ్ల తర్వాత తొలిభారతీయుడిగా రికార్డు**

రెండో రౌండ్‌కు చేరిన నాగల్

ఆస్ట్రేలియా ఓపెన్

**భారత యువ టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ సంచలన విజయం ఖాతాలో వేసుకున్నాడు. మూడున్నర దశాబ్దాలుగా భారత ఆటగాళ్లకు సాధ్యం కాని ఘనతను మెల్‌బోర్న్‌లో నాగల్ నిజం చేశాడు. ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో సీడెడ్ ప్లేయర్‌ను మట్టికరిపించి తొలిసారి రెండోరౌండ్‌కు ప్రవేశించాడు. రెండున్నర గంటలకు పైగా సాగిన సుదీర్ఘ పోరులో నాగల్ వరుస సెట్లలో విజృంభించగా.. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ అలవోకగా ముందంజ వేసింది.**



మెల్‌బోర్న్: సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో భారత ఆటగాడు దుమ్మురేపాడు. పెద్దగా అంచనాలు లేకుండా బరిలోకి దిగిన 26 ఏండ్ల సుమిత్ నాగల్.. అద్వితీయ ప్రదర్శనతో సీడెడ్ ఆటగాడిపై విజయం సాధించాడు. క్వాలిఫయింగ్ టోర్నీలో మూడు విజయాలు సాధించి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించిన నాగల్.. మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 6-4, 6-2, 7-6 (7/5)తో ప్రపంచ 27వ ర్యాంకర్ అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)పై విజయం సాధించాడు. నాగల్ కెరీర్‌లో ఇదే అత్యుత్తమ విజయం కాగా.. తొలిసారి అతడు ఆస్ట్రేలియా ఓపెన్ రెండో రౌండ్‌కు చేరాడు. ఐటా టోర్నీలతో రాటుదేలిన నాగల్.. మంగళవారం 31వ సీడ్ బబ్లిక్‌పై 2 గంటల 38 నిమిషాల పాటు పోరాడి విజయం సాధించాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 137వ స్థానంలో ఉన్న నాగల్.. ఈ ప్రదర్శనతో ర్యాంకింగ్ పాయింట్లతో పాటు.. భారీ నగదు బహుమతి ఖాతాలో వేసుకోనున్నాడు. 2019 యూఎస్ ఓపెన్ ద్వారా గ్రాండ్‌స్లామ్ ఎంట్రీ ఇచ్చిన నాగల్.. టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌పై ఒక సెట్ గెలిచి సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అడపా దడపా విజయాలు సాధిస్తూ వచ్చిన నాగల్.. ఇటీవలి కాలంలో నిలకడైన ప్రదర్శన చేస్తున్నాడు. టాప్-100లో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా కఠోర సాధన చేస్తూ మెరుగైన ఫలితాలు రాబడుతున్నాడు. సుదీర్ఘంగా సాగిన పోరులో ఒక్క ఏస్‌కే పరిమితమైన నాగల్.. 6 బ్రేక్ పాయింట్లు ఖాతాలో వేసుకోగా.. 13 ఏస్‌లు సంధించిన అలెగ్జాండర్ 3 బ్రేక్ పాయింట్లు సాధించాడు. 29 విన్నర్లు బాదిన నాగల్.. 26 అనవసర తప్పిదాలకు పాల్పడితే.. 41 విన్నర్లు కొట్టిన అలెగ్జాండర్ 44 తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. పదునైన సర్వీస్‌లతో పాటు.. నెట్ గేమ్‌తో ప్రత్యర్థికి ముప్పుతిప్పలు పెట్టిన నాగల్.. తొలి రెండు సెట్లను అలవోకగా కైవసం చేసుకున్నాడు. మూడో సెట్‌లో అలెగ్జాండర్ నుంచి గట్టి పోటీ ఎదురైనా.. వెనక్కి తగ్గకుండా పోరాడి చివరకు మ్యాచ్‌ను ముగించాడు. రెండో రౌండ్‌లో గురువారం జెన్‌చెంగ్ షాంగ్ (చైనా)తో నాగల్ అమీతుమీ తేల్చుకోనున్నాడు.



### స్వియాటెక్ సులువుగా..

ప్రపంచ నంబర్ ఇగా స్వియాటెక్.. ఆస్ట్రేలియా ఓపెన్‌లో అలవోక విజయంతో ముందంజ వేసింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం స్వియాటెక్ (పోలాండ్) 7-6 (7/2), 6-2తో మాజీ చాంపియన్ సోఫియా కెనిన్ (అమెరికా)పై విజయం సాధించింది. మూడేండ్ల క్రితం మెల్‌బోర్న్‌లో విజేతగా నిలిచిన కెనిన్‌ను స్వియాటెక్ వరుస సెట్లలో మట్టికరిపించింది. ఇతర మ్యాచ్‌ల్లో పెగులా 6-2, 6-4తో మారినోపై.. రడుకాను 6-3, 6-2తో రోజర్స్‌పై.. రిబాకినా 7-6, (8/6), 6-4తో ప్లిస్కోవాపై.. ఓస్టపెంకా 7-6 (7/5), 6-1తో బిరెల్‌పై విజయాలు సాధించారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ అల్కరాజ్ 7-6 (7/5), 6-1, 6-2తో గాస్కెట్‌పై.. ఆరో సీడ్ జ్వెరెవ్ 4-6, 6-3, 7-6 (7/3), 6-3తో కొఫెర్‌పై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.

> చాలా ఆనందంగా ఉంది. ఇది నాకు గర్వించదగ్గ విజయం. నా వరకు శక్తివంచన లేకుండా కష్టపడ్డా. అందుకు తగ్గ ఫలితం వచ్చిందనుకుంటున్నా. స్కోరు గురించి పట్టించుకోకుండా.. ఆటపైనే దృష్టిపెట్టా. నా సహజసిద్ధమైన ఆట ఆడా. తదుపరి మ్యాచ్ గురించి ఎక్కువ ఆందోళన చెందడం లేదు. - నాగల్

**1**

గ్రాండ్‌స్లామ్‌లో ఓ సీడెడ్ ప్లేయర్‌పై భారత ఆటగాడు గెలవడం 35 ఏండ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిగా 1989 ఆస్ట్రేలియా ఓపెన్‌లో రమేశ్ కృష్ణన్.. అప్పటి డిఫెండింగ్ చాంపియన్ మాట్స్ విలాండర్ (స్వీడన్)పై విజయం సాధించాడు.



# హోంగార్డుకు స్వర్ణం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): అంతర్ జిల్లా ల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఏసీబీ హోంగార్డు టి.ముఖేశ్ సింగ్ స్వర్ణ పతకం సాధించాడు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో 90+ కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో బరిలోకి దిగిన ముఖేశ్ బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ మంగళవారం తన కార్యాలయంలో ముఖేశ్‌సింగ్‌ను అభినందించి నగదు బహుమతి అందజేశారు.

# ప్రణయ్ శుభారంభం

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్, యువ ఆటగాడు ప్రియాన్షు రజావత్ ఇండియా ఓపెన్‌లో శుభారంభం చేశారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం ప్రణయ్ 21-6, 21-19తో చౌ టైన్ చెన్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో ప్రపంచ 30వ ర్యాంకర్ ప్రియాన్షు 16-21, 21-16, 21-13తో కామన్వెల్త్ చాంపియన్ లక్ష్యసేన్‌పై విజయం సాధించాడు. రెండో రౌండ్‌లో ప్రణయ్‌తో ప్రియాన్షు తలపడనున్నాడు.

# ప్రాఖర్ 404 నాటౌట్

## యువరాజ్ రికార్డు బద్దలు



*దేశవాళీ అండర్-19 టోర్నీ కూచ్ బెహర్ ట్రోఫీ ఫైనల్లో కర్ణాటక ప్లేయర్ ప్రాఖర్ చతుర్వేది (404 నాటౌట్; 46 ఫోర్లు, 3 సిక్సర్లు) తొలి క్వాడ్రపుల్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. ముంబైతో జరిగిన ఫైనల్లో ప్రాఖర్ ఈ ఘనత సాధించాడు. దీంతో 24 ఏండ్లుగా యువరాజ్ సింగ్ పేరిట ఉన్న 358 పరుగుల అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు బద్దలైంది.*






Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.